ఈనాడు
వైయస్సార్
గురువారం సెప్టెంబరు 26, 2024

రీల్స్ మోజు... ప్రాణాలకు ముప్పు!


ద్విచక్రవాహనాన్ని పూర్తిగా పైకెత్తి ఒకే చక్రంపై వెళ్తున్న యువత


సీటుపై కాళ్లు పెట్టి పైకెత్తి వాహనాన్ని నడుపుతూ...

రీల్స్ మోజులో పడి కడప నగరంలోని యువత ద్విచక్రవాహనాలపై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్నారు. మహావీర్ కూడలి నుంచి రిమ్స్‌కు వెళ్లే దారిలో ప్రమాదకరంగా ద్విచక్ర వాహనాలు నడుపుతూ భయాందోళనకు గురిచేస్తున్నారు. పొరపాటున వాహనం అదుపు తప్పితే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. సామాజిక మాధ్యమాల్లో వీరి రీల్స్ వైరల్ కావడంతో స్పందించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలపై పోలీసులు వీరిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

- న్యూస్‌టుడే, కడప నేరవార్తలు

ముంచెత్తిన వాన


లోహియానగర్‌లో మోకాలి లోతున వర్షపు నీరు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. అత్యధికంగా బ్రహ్మంగారిమఠం మండలంలో 130.2 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులు, లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలమయమయ్యాయి.

మండలం	వర్షపాతం (మి.మీలలో)
కడప	90.2
మైదుకూరు	90.0
ప్రొద్దుటూరు	82.6
పెండ్లిమర్రి	81.2
దువ్వూరు	78.8
ఎర్రగుంట్ల	70.0
వీఎన్‌పల్లె	68.2
కమలాపురం	65.2
రాజుపాలెం	65.0
బద్వేలు	64.8
తొండూరు	62.4
అట్లూరు	60.6
ముద్దనూరు	60.4

పల్లెపల్లెకు రహదారులు!

రహదారుల్లేని గ్రామాలు: 226
100 జనాభా లోపువి: 79
100 నుంచి 249 వరకు: 121
250 నుంచి 499 జనాభా: 22
500 కంటే అధికంగా ఉన్నవి: 4

☛ ఉమ్మడి కడప జిల్లాలో 226 గ్రామాలకు మోక్షం
☛ ఏడాదిలోగా నిర్మించాలని ఎన్డీయే సర్కారు లక్ష్యం
☛ స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పన

రహదారుల్లేని గ్రామాలకు త్వరలో మోక్షం కలగనుంది. ఈ మేరకు స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రాధాన్యమిచ్చారు. తరాలు మారినా తలరాతలు మారలేదన్నట్లుగా పలు గ్రామాలు రహదారులకు నోచుకోలేదు. ఉమ్మడి కడప జిల్లాలో 226 గ్రామాలను గుర్తించి ఏడాది లోగా రహదారులను నిర్మించాలని పంచాయతీరాజ్‌శాఖ ప్రణాళిక రూపొందించింది. దశల వారీగా చర్యలు చేపట్టడానికి కసరత్తు చేపట్టింది.

– ఈనాడు, కడప

స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా ప్రణాళికలు సిద్ధం చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా, మండలాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశాలందాయి. రహదారుల్లేని గ్రామాలను గుర్తించి వెంటనే నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు ముమ్మర కసరత్తు చేసిన విభాగం ఉమ్మడి కడప జిల్లాలో 226 గ్రామాలు రహదారికి నోచుకోనివి ఉన్నట్లు లెక్కలు తేల్చారు. 500 జనాభా కంటే అధిక జనాభా ఉన్న గ్రామాలు 4, 250 నుంచి 499 వరకు 22, 100 నుంచి 249 వరకు 121, 100 కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాలు 79 వంతున మొత్తంగా 226 వరకు ఉన్నట్లు గుర్తించారు. ఆయా గ్రామాలకు వచ్చే ఏడాది లోపు రహదారి సౌకర్యం కల్పించేవిధంగా ప్రణాళిక రూపొందిస్తున్నారు. పల్లెలకు కనీసం రహదారి మార్గాలు కల్పించకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నాళ్లయినా కనీసం రోడ్డుకు నోచుకోని పల్లెలుండడాన్ని గుర్తించారు. గతంలో 500 కంటే అధిక జనాభా ఉన్న గ్రామాలను గుర్తించి రహదారులు నిర్మించారు. దాదాపు నిర్మాణాలు చేపట్టినప్పటికీ జనాభా పెరిగిన తరుణంలో ఈ కేటగిరి జాబితాలో నాలుగు చేరాయి. మరికొన్ని చోట్ల కొత్తగా కాలనీలు ఏర్పాటు కావడం, జగనన్న కాలనీల పేరిట నిర్మాణాలు చేపట్టడంతో రహదారుల ఆవశ్యకత ఏర్పడింది. వీటన్నింటికీ ఎన్డీయే ప్రభుత్వం మోక్షం కల్పించే దిశగా ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. పంచాయతీరాజ్ విభాగం మంత్రిత్వశాఖను చూస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. తొలి ప్రాధాన్యంగా రహదారులు లేని గ్రామాలకు ప్రాధాన్యమిచ్చే దిశగా సన్నాహాలు చేస్తున్నారు. బీటీ, సిమెంటు రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు.


రాయచోటి మండలం కురవపల్లె గ్రామానికి వెళ్లే మట్టి రహదారి

ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం

రహదారుల్లేని గ్రామాలను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. ఏడాది లోగా రహదారుల్లేని గ్రామాలు ఉండరాదనే సంకల్పంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఉమ్మడి కడప జిల్లాలో మండలాల వారీగా కసరత్తు చేస్తున్నాం. రహదారుల మరమ్మతులు సైతం ప్రాధాన్య క్రమంలో చేపట్టబోతున్నాం.

- శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం

తప్పు చేసినవారికి శిక్ష తప్పదు

తిరుమల లడ్డూ ప్రసాదం వ్యవహారంపై విచారణకు సిట్ ఏర్పాటు
జడ్పీ వాణిజ్య సముదాయం ప్రారంభోత్సవంలో మంత్రి మండిపల్లి


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి. పక్కన కలెక్టర్ శివశంకర్, జడ్పీ ఛైర్‌పర్సన్ శారద, ఎమ్మెల్యేలు మాధవిరెడ్డి, కృష్ణచైతన్యరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, అధికారులు, నాయకులు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : ‘గత వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని గుజరాత్‌కు చెందిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) ధ్రువీకరించింది. దీనిపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిట్ వేసింది. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదం విషయంలో తప్పు చేసినవారికి శిక్ష తప్పదు’ అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. కడప నగరంలో రూ.4.5 కోట్లతో నిర్మించిన జిల్లాపరిషత్తు వాణిజ్య సముదాయాన్ని బుధవారం ఆయన కలెక్టర్ శివశంకర్, జడ్పీ ఛైర్‌పర్సన్ శారద, కడప, కమలాపురం, రాజంపేట ఎమ్మెల్యేలు మాధవిరెడ్డి, కృష్ణచైతన్యరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం పూజాకార్యక్రమాలు నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జడ్పీ పరిధిలో ఏర్పాటు చేసిన సౌరవిద్యుత్తు ప్లాంటును ప్రారంభించిన పిదప తిరుపతి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. గత వైకాపా ప్రభుత్వ పాలనలో రాష్ట్రాన్ని అథోగతి పాల్జేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఎన్డీయే ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, సీఈవో సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో రమణారెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి, పోరుమామిళ్ల జడ్పీటీసీ సభ్యుడు ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మరోవైపు ప్రారంభోత్సవంలో భాగంగా కొన్ని గదులకు కట్టిన రిబ్బన్లను వైకాపా నాయకులు కత్తిరించడం గమనార్హం.

ఆక్రమణలపై ఉక్కుపాదం!

▪ వైకాపా కార్పొరేటర్ల అనధికారిక లేఅవుట్‌లో వంక
▪ వరద కాలువ తవ్వకం ప్రారంభించిన అధికారులు
▪ తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేసిన నాయకులు

– న్యూస్‌టుడే, కడప నగరపాలక, నేరవార్తలు

వంకలు, వాగులు, కుంటలు, చెరువులు ఆక్రమించినవారు ఇక భయపడక తప్పదు! హైదరాబాద్ నగరంలో హైడ్రా తరహాలో కడప నగరంలో ఆక్రమిత స్థలాల స్వాధీనానికి అధికార యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. దీంతో గత కొన్నేళ్లుగా జలవనరులను జనావాసాలుగా మార్చేసిన వైకాపా నేతలు, వారి అనుచరుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. జలవనరుల్లో ఆక్రమణల తొలగింపుల్లో భాగంగా కడప నగరంలోని రామాంజనేయపురంలోని వైకాపా కార్పొరేటర్ల అనధికారిక లేఅవుట్‌లో బుధవారం నీటిపారుదలశాఖాధికారులు వరద కాలువ తవ్వకాలు ప్రారంభించారు. ఆ లేఅవుట్‌లోని వరద కాలువను ఆక్రమించి ప్లాట్లు, రహదారులు నిర్మించారని కొన్ని రోజుల కిందట చేపట్టిన సర్వేలో తేల్చారు. ఇలా ఆక్రమించిన వరద కాలువను పునరుద్ధరించడానికి ఈఈ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో యంత్రాలతో తవ్వకాలు మొదలుపెట్టారు.

◆ వైకాపా జిల్లా కార్యాలయం నిర్మిస్తున్న స్థలానికి పక్కనే కడప-తిరుపతి జాతీయ రహదారికి అత్యంత సమీపంలో 2023, డిసెంబరులో వైకాపా కార్పొరేటర్లు అనధికారికంగా లే అవుట్ వేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం ఎమ్మెల్యే మాధవిరెడ్డి జలవనరులను ఆక్రమించిన లేఅవుట్లపై పరిశీలన చేపట్టారు. దీనిలో భాగంగా ఈ లేఅవుట్‌లో వరద కాలువ ఉందని సర్వేలో తేల్చారు. ఆక్రమిత స్థలం వరకు మార్కింగ్ ఇచ్చారు. దాదాపు 50 రోజుల అనంతరం నీటిపారుదలశాఖాధికారులు భారీ పోలీస్ బందోబస్తు నడుమ లేఅవుట్‌లో వరదకాలువ నిర్మాణానికి తవ్వకాలు మొదలుపెట్టారు.

◆ పాలకొండల నుంచి వచ్చే వరద పెద్దిరాజు చెరువులోకి చేరుతుంది. అక్కడ నుంచి కేంద్రకారాగారం, మహిళా పాలిటెక్నిక్ కళాశాల మీదుగా వైకాపా కార్పొరేటర్లు వేసిన అనధికారిక లేఅవుట్ నుంచి దిగువకు ప్రవహించి రామకృష్ణనగర్ తదితర ప్రాంతాల ద్వారా బుగ్గవంకలో కలుస్తుంది. వైకాపా నాయకుల అనధికారిక లేఅవుట్‌లోని వరద కాలువను ఆక్రమించడంతో కేంద్రకారాగారం, పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతాల్లో వరదనీరు ముంచెత్తుతోందని నీటిపారుదలశాఖాధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో లేఅవుట్‌లో వరద కాలువ పునరుద్ధరణకు ప్రహరీని పగలగొట్టి యంత్రాలతో తవ్వకాలు ప్రారంభించారు.

◆ లేఅవుట్‌లో వరద కాలువ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నారని తెలియగానే పెద్దసంఖ్యలో వైకాపా కార్పొరేటర్లు చేరుకున్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబు వచ్చారు. లేఅవుట్‌లోని స్థలాన్ని బ్యాంకు వేలం ద్వారా కొని కలెక్టర్ నుంచి ఎన్ఓసీ పొంది ల్యాండ్ కన్వర్షన్ ఛార్జీలు కూడా చెల్లించామని, ఇందులో నిర్మాణాలకు ప్లాన్ అప్రూవల్ ఇచ్చారని వారు అధికారులతో వివాదించారు. ఈ అంశంపై హైకోర్టు ఉత్తర్వులున్నా తవ్వకాలు చేపడుతున్నారని తెలిపారు.



జేసీబీతో తవ్వుతున్న కాలువ, లేఅవుట్‌లో తవ్విన వరద కాలువ


వైకాపా నేత... అటవీ భూమి మేత!

బయటపడేందుకు పార్టీ మారే యత్నం ☛ వెలుగులోకి వచ్చిన భారీ భూఆక్రమణ

– ఈనాడు, కడప, న్యూస్‌టుడే, జమ్మలమడుగు, మైలవరం

ఆయన వైకాపా నేత... గత వైకాపా ప్రభుత్వ హయాంలో జమ్మలమడుగుకు చెందిన ఓ కీలక నేత వద్ద పనిచేస్తున్న పీఏకు స్వయానా బావ. ఆయన ఏకంగా అటవీభూమినే ఆక్రమించేశారు. ఆపై సొంత పొలం మాదిరిగా కంచె వేసి బోర్లు తవ్వి ఉద్యానతోటల సాగు చేపట్టారు. అడ్డు అదుపులేకుండా ఎకరాల కొద్దీ భూమిని నొక్కేసి... ఇప్పుడు చల్లగా తెదేపాలో చేరిపోతే ఏ ఇబ్బంది ఉండదనే ప్రయత్నం చేశారు. చివరకు పీఏకు బావగా, వైకాపా నేతగా చలామణి అవుతున్న వ్యక్తి వ్యవహారాన్ని తెదేపా నేతలు గుర్తు చేసుకుని పార్టీలో చేర్చుకోకుండా దూరంగా పెట్టారు. ఈ క్రమంలో భారీ కబ్జా వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

గత వైకాపా ప్రభుత్వంలో ప్రభుత్వ భూముల కబ్జాకు అంతే లేకుండా పోయింది. ఆ పార్టీ ప్రజాప్రతినిధుల అండతో నాయకులు వందలాది ఎకరాలు ఆక్రమించేశారు. మైలవరం మండలంలో ఏకంగా అటవీ భూమునే ఆక్రమించి సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నారు. మండలంలోని వెన్నవేముల రెవెన్యూ గ్రామ కొండసుంకేసుల గ్రామానికి వెళ్లే మార్గంలో చెన్నకేశవస్వామి కొండ సమీపంలో అటవీ రిజర్వు భూమి ఉంది. బి.జంగాలపల్లె గ్రామానికి చెందిన సదరు వైకాపా నేత (బావ) అటవీశాఖకు చెందిన భూమిని ఆక్రమించుకుని సాగు చేస్తున్నారు. సర్వే నంబరు 557లో 383 ఎకరాల అటవీశాఖకు చెందిన భూమి ఉంది. ఇందులో సగానికి పైగా ఆక్రమించుకుని చుట్టూ ప్రహరీగా కంచె ఏర్పాటు చేసి బోర్లు, విద్యుత్తు కనెక్షన్లు తీసుకున్నారు. అక్రమంగా విద్యుత్తు నియంత్రికలతోపాటు సౌరవిద్యుత్తు ప్లాంటుతో చుట్టూ దీపాలు సైతం ఏర్పాటు చేసుకున్నారు. భూమిని ఆక్రమించుకున్న అనంతరం సమీపంలోని చెరువు నుంచి యంత్రాలతో అక్రమంగా మట్టిని తరలించి చదును చేసి చీనీ, రేగు చెట్లు సాగు చేస్తున్నారు. వెన్నవేముల గ్రామ పొలంలోని సర్వే నంబరు 365లోనూ మరికొంత పొలాన్ని ఆక్రమించారు. గత ప్రభుత్వంలోనే పంట నష్ట పరిహారం, వివిధ రకాల రాయితీలు, బిందు సేద్యం పరికరాలు సైతం పొందారు. దీనిపై వెంకట శివయాదవ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ, అటవీశాఖ అధికారులు ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవడంపై దృష్టిసారించారు.


అటవీ భూమిలో సాగుచేసిన తోటలు

ఆక్రమణలపై ఫిర్యాదులు చేశాం

అటవీ భూముల ఆక్రమణలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మాజీ ప్రజాప్రతినిధి వద్ద పీఏగా పని చేస్తున్న వ్యక్తి సమీప బంధువు కావడంతో అధికారులు పట్టించుకోలేదు. ఆధారాలతో సహా మద్దనూరు అటవీశాఖాధికారులతోపాటు జమ్మలమడుగు ఆర్డీవోకు సైతం ఫిర్యాదులు చేసినా స్పందించలేదు. జిల్లా కలెక్టర్‌ను కలిసి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశాను.

- వెంకట శివయాదవ్, బి.జంగాలపల్లె, మైలవరం మండలం

సర్వే చేయిస్తున్నాం

అటవీ భూముల ఆక్రమణలను గుర్తించాం. దస్త్రాలను పరిశీలించి ఎంత భూమి ఆక్రమణకు గురైందో సర్వే చేయించేందుకు చర్యలు చేపట్టాం. సర్వే చేసిన తర్వాత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకుంటాం.

- అశోక్‌కుమార్, అటవీశాఖ అధికారి, ముద్దనూరు

దసరాకు 230 ప్రత్యేక బస్సులు

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే : దసరా పండగ సందర్భంగా 230 ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల్లో వృత్తిరీత్యా, వివిధ రకాల చదువులు చదువుకుంటున్న వారందరిని పండగకు సొంత ఊళ్లకు తీసుకొచ్చేందుకు అక్టోబరు 8 నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుస్తాయన్నారు. సాధారణ ఛార్జీలతో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని, ముందస్తు రిజర్వేషన్ సౌకర్యముందన్నారు. హైదరాబాద్ నుంచి 90 బస్సులు, బెంగళూరు నుంచి 70, విజయవాడ నుంచి 30, చెన్నై నుంచి 10 బస్సులు చొప్పున ఏర్పాటు చేశామన్నారు. తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురం జిల్లాలకు కూడా 30 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అక్టోబరు 7, 8 తేదీల్లో తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. పౌర్ణమి సందర్భంగా అక్టోబరు 16న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం తెలిపారు.


గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప నగర శివార్లలోని కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో అక్టోబరు 10వ తేదీ నుంచి నిరుద్యోగ గ్రామీణ యువతకు సెల్‌ఫోన్ రిపేరింగ్-సర్వీసింగ్ (30 రోజులు), ఫొటోగ్రఫీ-వీడియోగ్రఫీ (30 రోజులు), సీసీ టీవీ కెమెరాలు-ఇన్‌స్టలేషన్-రిపేరింగ్ (13 రోజులు)లకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టరు ఆరీఫ్ తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల గల నిరుద్యోగ యువకులు శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలకొండల్లో జల సోయగం!

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పాలకొండల నుంచి జలపాతం జాలువారుతూ కనువిందు చేస్తోంది. కడప నగరానికి ఆనుకుని ఉన్న ఈ కొండల నుంచి వస్తున్న నీటిని వీక్షించేందుకు యువత పెద్దఎత్తున వస్తోంది. జలపాతం వద్ద యువతీ యువకులు, చిన్నారులు, పెద్దలు కేరింతలు కొడుతూ ఇక్కడ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. పోలీసులు పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు తీసుకోవాలని సందర్శకులు, నగర వాసులు కోరుతున్నారు.

- ఈనాడు, కడప




పాస్ఫేట్ కొంటేనే యూరియా

వరి రైతులపై అదనపు భారం
ఉమ్మడి కడప జిల్లాలో దుస్థితి

– న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

ఉమ్మడి కడప జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 41 వేల హెక్టార్లు కాగా, 37 వేల హెక్టార్లలో సాగైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వరి సాగులో ఎకరాకు సుమారు మూడు బస్తాల యూరియాను రైతులు వినియోగిస్తారు. ఇదే అదనుగా తీసుకుని కొందరు ఎరువుల వ్యాపారులు పాస్ఫేట్ కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని మెలిక పెడుతున్నారు. తమకు యూరియా మాత్రమే కావాలని రైతులు కోరుతున్నా వ్యాపారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా కొనుగోలుకు రైతులు ఆసక్తి చూపించినప్పుడే ఆయా గ్రామాలకు చేరుతోంది. వ్యవసాయాధికారులు మాత్రం ఆయా కేంద్రాల్లో అవసరమైన మేరకు రవాణా చేస్తున్నారు. దీంతో సన్న, చిన్నకారు రైతులతోపాటు కౌలు రైతులు యూరియా కొనుగోలుకు ప్రైవేటు ఎరువుల దుకాణాలపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రొద్దుటూరులో కొందరు ప్రైవేటు ఎరువుల దుకాణదారులు ఎమ్మార్పీ ధర కన్నా బస్తాకు రూ.5 నుంచి రూ.15 దాకా అధికంగా వసూలు చేస్తున్నారు.


తాళ్లమాపురంలో సాగవుతున్న వరి పంట

పాస్ఫేట్ కొనాల్సిందేనట



రెండెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాను. ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో యూరియా కొనాలంటే పాస్ఫేట్ తీసుకోవాల్సిందేనని వ్యాపారులు ఒత్తిడి చేస్తున్నారు. అవసరం లేకున్నా పాస్ఫేట్ విక్రయాలు జరుపుతున్నారు. దీంతో మాపై అదనపు భారం పడుతోంది.

- పసుపుల నరసింహులు, నాగాయపల్లె

పర్యవేక్షణకు ఆదేశాలిస్తాం

రైతులకు అవసరమైన యూరియాను మాత్రమే ప్రైవేటు వ్యాపారులు విక్రయించాలి. పాస్ఫేట్ కొంటేనే యూరియా ఇస్తామనడం సరికాదు. వెంటనే ఎరువుల దుకాణాలను పర్యవేక్షించాలని మండల వ్యవసాయాధికారులను ఆదేశిస్తాం.

- నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి, వైఎస్ఆర్

ఎక్సైజ్ నేరాల కట్టడికి కృషి



కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప, అన్నమయ్య జిల్లాల ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటు అదనపు కమిషనర్‌గా వి.చంద్రశేఖర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరులో పని చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ నేరాల కట్టడికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఎక్సైజ్ పర్యవేక్షణాధికారిగా బాధ్యతల స్వీకరణ



జిల్లా ఎక్సైజ్ పర్యవేక్షణాధికారిగా ఎస్.రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న గోపాల్ ఓ మంత్రికి ఓఎస్డీగా వెళ్లారు. ఒంగోలులో పని చేస్తున్న రవికుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎక్సైజ్ శాఖలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకుని రావాలని సూచించారు.



మాట్లాడుతున్న అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరాజనంద స్వామి

తిరుమల లడ్డూ కల్తీ బాధ్యులను కఠినంగా శిక్షించాలి

మైదుకూరు, న్యూస్‌టుడే : తిరుమల లడ్డూ కల్తీపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులైన వారు ఏ స్థాయిలో ఉన్నా వారు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని బ్రహ్మంగారిమఠం అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామి అన్నారు. ధర్మం అంటే నమ్మకం లేనివారిని నియమించి సమస్యను సృష్టించుకున్నారని, అనుమానం కలిగించారని, హిందువుల ఆలయాలపై దాడుల నేపథ్యంలో పునరావృతంకాకుండా పాలకులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం మైదుకూరులో బ్రహ్మంగారి మఠం అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదేవరాయులు కూడలిలో మానవహారంగా ఏర్పడి మాట్లాడారు. సనాతన ధర్మానికి వేదికలు కావాల్సిన దేవాలయాలు రాజకీయ నాయకులకు పునరావాస కేంద్రాలుగా మారడం దురదృష్టకరమన్నారు.

'మన గండికోట' పుస్తకాల పంపిణీ 27న

ఎన్‌జీవో కాలనీ (కడప), న్యూస్‌టుడే : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంటాక్ ఆధ్వర్యంలో ఈ నెల 27న గండికోటలో 'మన గండికోట' పేరిట రూపొందించిన పది వేల పుస్తకాలను పంపిణీ చేయనుంది. గండికోట గురించి 34 పేజీలతో క్లుప్తంగా వివరించినట్లు ఇంటాక్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి పేర్కొన్నారు. గండికోటలోని అన్ని ప్రముఖ ప్రాంతాలు, చారిత్రక నిర్మాణాల గురించి ప్రాథమిక సమాచారం అందజేసే వివరాలున్నాయని తెలిపారు.

ట్రిపుల్‌ఐటీకి కొత్త డీన్ల నియామకం

వేంపల్లె, న్యూస్‌టుడే: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి కొత్త డీన్లను నియమిస్తూ డైరెక్టర్ కుమారస్వామి గుప్త ఉత్తర్వులు జారీచేశారు. అకడమిక్ డీన్‌గా సివిల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ దండుకర్ రమేష్ కైలాస్, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌గా వెంకటేశులను నియమించారు. బుధవారం వారు బాధ్యతలు స్వీకరించారు. వారిని ఏవో రవికుమార్, క్యాంపస్ ఇన్‌ఛార్జి బొజ్జ అనిల్‌కుమార్‌రెడ్డి, రోజర్‌బిన్నీ, తదితరులు సత్కరించారు.



వెంకటేశును సత్కరిస్తున్న ఏవో రవికుమార్, తదితరులు

విద్యార్థులూ... పిలుస్తోంది ఇన్‌స్పైర్ మనాక్

542 నామినేషన్లు మాత్రమే నమోదు ● దరఖాస్తులకు అక్టోబరు 15 వరకు గడువు

విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో, సృజనాత్మకతను పెంపొందించేలా శాస్త్ర సాంకేతిక విభాగం 2009-10 విద్యా సంవత్సరం నుంచి ఇన్‌స్పైర్ మనాక్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సహకారంతో భారత ప్రభుత్వం దీన్ని ఆధునీకరించింది. ఇన్‌స్పైర్ మనాక్‌గా ప్రస్తుతం కొనసాగుతోంది. విద్యార్థులు రూపొందించే సైన్స్ ఆవిష్కరణలు కేవలం పోటీకే పరిమితం కాకుండా ప్రజా సమస్యలకు పరిష్కారం కనుగొనే దిశగా పయనించాలన్న ఆలోచనలు ముందడుగు వేస్తున్నాయి.



ఇన్‌స్పైర్ మనాక్ ప్రదర్శనలో భాగంగా ఓ విద్యార్థిని ప్రదర్శన, చిత్రంలో గైడ్ ఉపాధ్యాయిని, అప్పటి సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి (పాతచిత్రం)

న్యూస్‌టుడే, కడప విద్య

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లోని 6 నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు సైన్స్ ఉపాధ్యాయులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుంది. జిల్లా నుంచి ఇప్పటి వరకూ 115 పాఠశాలల నుంచి 542 నామినేషన్లు మాత్రమే రిజిస్ట్రేషన్ జరిగాయి. అక్టోబరు 2 నుంచి 14వ తేదీ వరకూ దసరా సెలవులు ప్రకటించినందున అప్పటి వరకూ మాత్రమే రిజిస్ట్రేషన్ కోసం అవకాశం ఉంటుంది. జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ నమోదులో వేగం పెంచాల్సి ఉంది. ఆ దిశగా జిల్లా విద్యాశాఖ అధికారులు కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాల్సి ఉంది. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల వివరాలను ఇన్‌స్పైర్ మనాక్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని పాఠశాల లాగిన్ ద్వారా నమోదు చేయాలి. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నామినేషన్ల ప్రక్రియ జరుగుతోంది. అక్టోబరు 15వ తేదీ వరకూ గడువు ఉంది. సామాజిక సమస్యలకు పరిష్కారం సూచించే విధంగా విద్యార్థులు వినూత్న ఆలోచనలతో డ్రాఫ్ట్ రూపంలో ప్రాజెక్టును తీర్చిదిద్ది వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. విద్యార్థులు పంపిన ప్రాజెక్టులను విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలించి ప్రాజెక్టుల ఎంపిక చేస్తారు. ఎంపికైన ప్రాజెక్టులకు రూ.10 వేలు వారి బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు. ఈ డబ్బులతో సైన్స్ ఉపాధ్యాయుడి సహకారంతో విద్యార్థి ప్రాజెక్టును సిద్ధం చేసి జిల్లా ప్రదర్శనకు రావాల్సి ఉంటుంది. జిల్లా నుంచి నామినేషన్లు పంపిన వారిలో ఎంపిక చేసిన ప్రదర్శనలు జిల్లాస్థాయికి అనుమతిస్తారు. అలా ఎంపికైన విద్యార్థి ప్రాజెక్టులు రూపొందించడానికి వీలుగా ప్రభుత్వమే విద్యార్థి ఖాతాలో రూ. 10 వేలు జమచేస్తుంది. జిల్లాస్థాయి ప్రదర్శనలో ఎంపికయిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు అర్హత పొందుతాయి. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వాటిని జాతీయ స్థాయి ప్రదర్శనకు అనుమతిస్తారు. జాతీయస్థాయిలో ఎంపికైే ఉత్తమ నమూనాగా గుర్తిస్తే ఆ నమూనాను రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించే అవకాశం కల్పిస్తారు. జిల్లాలో 310 ప్రభుత్వ యాజమాన్య ఉన్నత పాఠశాలలు, సుమారు 600 పైబడి ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుల ప్రదర్శన ఇంకా జరగలేదు. గతేడాది 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటికీ జిల్లాస్థాయి ప్రదర్శనలు జరగలేదు. కరోనా ముందు ఏటా నిర్ణీత సమయంలో ఈ కార్యక్రమం పకడ్బందీగా జరుగుతుండేది. కరోనా సమయం నుంచి ఆలస్యమవుతూ వస్తోంది. ఈ ఏడాది పూర్తి స్థాయిలో ప్రదర్శనలు జరుగుతాయనుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరం అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి ఆశించిన స్థాయిలో నామినేషన్లు వెళ్లాల్సి ఉంది. ఆ దిశగా సంబంధిత అధికారులు, సైన్స్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు చొరవ చూపించి నామినేషన్ల నమోదు, ప్రాజెక్టుల రూపకల్పనలో విద్యార్థులు విజయం సాధించేలా చేయాల్సిన ఆవశ్యకతను గుర్తించాల్సి ఉంది.

సంవత్సరం	జిల్లాలో ప్రదర్శించిన నమూనాలు	రాష్ట్ర స్థాయికి ఎంపికైనవి	జాతీయ స్థాయికి ఎంపికైనవి
2015 - 16	720	72	4
2016 - 17	784	78	8
2017 - 18	496	49	7
2018 - 19	362	36	3
2019 - 20	483	48	5
2020 - 21	335	34	3
2021 - 22	351	35	1
2022 - 23	272	14	4

2023 - 24 పాఠశాల స్థాయి నుంచి జిల్లా స్థాయికి 241 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. జిల్లా స్థాయి ప్రాజెక్టుల ప్రదర్శన ఇంకా జరగలేదు.

సంవత్సరం	జిల్లా నుంచి పంపిన మొత్తం నామినేషన్లు
2020 - 21	1,473
2021 - 22	1,707
2022 - 23	1,986
2023 - 24	2,727
2024 - 25	542 (ఇప్పటి వరకు)

నామినేషన్లు పెంచేలా చర్యలు



ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్ల సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయుల ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పూర్తిస్థాయిలో ప్రణాళికలు అమలు చేస్తున్నాం. ప్రతి పాఠశాల నుంచి తప్పనిసరిగా ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి నమూనాలను అప్‌లోడ్ చేయాలి. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలూ భాగస్వాములు కావాలి. విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించేలా జిల్లావ్యాప్తంగా అన్ని విధాలా చర్యలు చేపడతాం. - అనురాధ, జిల్లా విద్యాశాఖాధికారి

మహిళా ప్రాంగణానికి పూర్వవైభవం తెస్తాం

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: తెదేపా హయాంలో ఆదరణ కార్యక్రమం ద్వారా మంజూరైన పరికరాలను, వాహనాలను వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టడం దారుణమని ఎమ్మెల్యే మాధవి అన్నారు. కడప శివారులోని మహిళా ప్రాంగణంలో నిరుపయోగంగా నిల్వ ఉంచిన కుట్టుమిషన్లు, సిల్క్ యంత్రాలు, చెత్త సేకరించే ఆటోలు, బైండింగ్ మిషన్లను ఎమ్మెల్యేతో పాటు కలెక్టరు లోతేటి శివశంకర్, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, నగర పాలక కమిషనర్ నందన్‌లు బుధవారం పరిశీలించారు. ఈ యంత్రాలను, వాహనాలను త్వరలో ఉపయోగంలోకి తీసుకొస్తామని కలెక్టరు చెప్పారు. అక్టోబరు 2న గాంధీజయంతి సందర్భంగా అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. వైకాపా పాలనలో నిర్వీర్యమైన కడప మహిళా ప్రాంగణానికి పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. వైకాపా పాలనలో ప్రజలకు ఉపయోగపడాల్సిన సామగ్రిని ఇలా నిరుపయోగంగా పడేయడం దారుణమని ధ్వజమెత్తారు. దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించి మహిళా ప్రాంగణాన్ని పునరుద్ధరించి అతివలను ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. గత వైకాపా పాలనలో ఆక్రమించిన లేఅవుట్లను పరిశీలించేందుకు వెళ్లిన అధికారులను వైకాపా నాయకులు అడ్డుకోవడం తగదన్నారు. వంకలు, వాగులు ఎవరైనా కబ్జా చేస్తే వాటిని కూల్చివేస్తామన్నారు.



కుట్టు మిషన్ల చెక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎమ్మెల్యే మాధవి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని బొగ్గిడివారిపల్లె పరిధి నిర్మలగిరికాలనీ ప్రాంతంలో ఇద్దరు చిన్నారుల మృతి చెందిన ఘటనపై డీఎంహెచ్‌వో నాగరాజు ఆరా తీశారు. రాజంపేట మండలం బయనపల్లెకు చెందిన చెంచయ్య, కోరమ్మ తమ కటుంబ సభ్యులతో వారం రోజుల నుంచి నిర్మలగిరికాలనీ సమీపంలో గుడారం వేసుకుని ఉండగా వారి ఇద్దరు కుమార్తెలు అనారోగ్యానికి గురై మంగళవారం మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బుధవారం డీఎంహెచ్‌వో నాగరాజు, అదనపు డీఎంహెచ్‌వో ఉమామహేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారిణి మనోరమ నివాస ప్రాంతాన్ని సందర్శించారు. వారు అక్కడ లేకపోవడంతో అధికారులు గ్రామస్థులను విచారించారు. డీఎంహెచ్‌వో మట్లాడుతూ గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగి జ్వరాలపై ఆరా తీశారని ఎక్కడా జ్వరాలు లేవన్నారు. సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు, మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ పాల్గొన్నారు.



గ్రామస్థులను విచారిస్తున్న డీఎంహెచ్‌వో నాగరాజు, అధికారులు

జిల్లాలో 252 మంది వీఆర్వోల బదిలీ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 252 మంది వీఆర్వోలను కలెక్టరు లోతేటి శివశంకర్ బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం తహసీల్దార్లు, జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేసిన విషయం తెలిసిందే.

పోలీసు కుటుంబాల ఆరోగ్యంపై దృష్టి

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : జిల్లా పోలీసు కార్యాలయంలోని ఉమేష్‌చంద్ర కల్యాణ మండపంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆధ్వర్యంలో బుధవారం రెండో రోజు కూడా పోలీసు కుటుంబాలకు, మహిళా పోలీసులకు క్యాన్సర్ నిర్ధారణ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ.. పోలీసు కుటుంబాలు ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. క్యాన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్ అనేది చాలా కీలకమని స్పష్టం చేశారు. విజయవాడ మణిపాల్ ఆసుపత్రి వైద్యులు దివ్య, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, పోలీసు ఆసుపత్రి వైద్యురాలు మేరీ సుజాత, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్, మాధవీలత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



పేర్లు నమోదు చేయించుకుంటున్న మహిళా పోలీసులు



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు తులసిరెడ్డి, విజయజ్యోతి, కార్యకర్తలు

హామీల అమలుకు నిరసన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఎన్డీఏ వందరోజుల పాలన పెనం నుంచి పొయ్యిలో పడినట్లు ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ తులసిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో హామీల వైఫల్యాలను నిరసిస్తూ బుధవారం కడప కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైకాపా పాలనలో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయి, అభివృద్ధి జరగలేదన్నారు. వారు చేసిన దుర్మార్గాలను ప్రజలు గమనించి కూటమికి అధికారం కట్టబెడితే ఇంతవరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయలేదని విమర్శించారు. సామాజిక పింఛన్ల పెంపు తప్ప మిగిలిన హామీలను అమలు చేయలేదన్నారు. నాయకులు అఫ్జల్‌ఖాన్, మహ్మద్‌అలీఖాన్, జకరయ్య, సుమంత్‌కుమార్, సలావుద్దీన్, మధురెడ్డి, ధ్రువకుమార్‌రెడ్డి, పుల్లయ్య, శ్యామలమ్మ, వంశీయాదవ్, విజయభాస్కర్, హరిప్రసాద్, సునీల్, అన్వర్, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, హమీద్, కమల్, రహ్మతుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక ఉద్యోగి ఆత్మహత్య



చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక ఓ ప్రైవేటు ఉద్యోగి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారని ఎస్సై శ్రీనివాసులురెడ్డి బుధవారం తెలిపారు. సీకే దిన్నెకు చెందిన **రామచంద్రారెడ్డి (43)** కడపలోని ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవల నూతనంగా నిర్మించిన ఇంటికి దాదాపు రూ.15లక్షల వరకూ అప్పులు చేశారు. ఈ నేపథ్యంలో రుణాలకు వడ్డీలు అధికమవుతుండడం... వాటిని ఎలా తీర్చాలో తెలియక ఒత్తిడికి గురై మంగళవారం అర్ధరాత్రి ఇంటి సమీపంలోని రైస్‌మిల్ వద్దకెళ్లి పురుగుల మందు తాగారు. ఆయన భార్య, ఇద్దరు పిల్లలు, కుటుంబ సభ్యులు శ్రీనివాసులరెడ్డి కనిపించకపోవడంతో గాలించగా... గ్రామస్థుల సమాచారం మేరకు మిల్లు వద్ద కెళ్లి చూడగా అప్పటికే మృతి చెందారు. పోలీసులు సంఘటనా స్థలానికొచ్చి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

పులివెందులలో హత్య

వివాహేతర సంబంధమే కారణం



పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే: పులివెందుల పట్టణంలోని రాజారెడ్డికాలనీ సమీపంలో బుధవారం హత్య జరిగింది. వేముల మండలం చాగలేరుకు చెందిన **రామాంజనేయులు(55)** రాజారెడ్డికాలనీకి చెందిన లక్ష్మీతో వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం సదరు మహిళ ఇంటివద్దకు వెళ్లగా ఆమె కుమారులు సందీప్, శివనాగేంద్ర తమ తల్లితో అక్రమ సంబంధం పెట్టుకున్నారనే అక్కసుతో అతడిపై కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన అతన్ని స్థానికులు కడప సర్వజన ఆసుపత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. హతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణ, సీఐ గంగనాథ్‌బాబు వెల్లడించారు.

రైలు కింద పడి వ్యక్తి బలవన్మరణం

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో అన్నారెడ్డి రాజగోపాల్‌రెడ్డి (34) అనే వ్యక్తి రైలు కిందపడి బలవన్మరణం చెందారని బుధవారం రైల్వే పోలీసులు తెలిపారు. స్థానిక శ్రీరాములపేట నివాసం ఉండే అన్నారెడ్డి వెంకటరామిరెడ్డి కుమారుడు రాజగోపాల్‌రెడ్డి ప్రొద్దుటూరులోని ఒక ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ విధులు నిర్వహిస్తున్నారు. రాజగోపాల్‌రెడ్డి దంపతులకు ఒక కుమార్తె ఉన్నారు. ఇంట్లో వచ్చిన మనస్పర్ధల వల్ల రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తి...

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ముద్దనూరు-కలమల్ల రైల్వేస్టేషన్ మధ్యలో రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి (సుమారు 45) మృతి చెందినట్లు బుధవారం రైల్వే పోలీసులు తెలిపారు. విజయవాడ-ధర్మవరం వెళ్లే రైలు నుంచి ఉదయం జారి కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. అతను ఎర్రటి టీ షర్ట్ ధరించి ఉన్నట్లు వివరించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో 11 మందికి మూడేళ్లు జైలు

కొండాపురం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నేరం రుజువు కావడంతో 11 మందికి మూడేళ్లు జైలుశిక్ష, జరిమానా విధించారు. కొండాపురం ఎస్సై విద్యాసాగర్ వివరాల మేరకు.. 2016 అక్టోబరు 22న వెంకయ్యకాల్వ గ్రామానికి చెందిన చిన్నకుళ్లాయప్ప కుమార్తె కవిత పెళ్లిని పురస్కరించుకుని ఇచ్చే విందుకు అదే గ్రామానికి చెందిన లచ్చుప్పగారి ఓబులేసు, లచ్చన్నగారి కుళ్లాయప్ప, ఎ.కుళ్లాయప్ప, గంగమ్మ, ఎల్.కుళ్లాయప్ప, జి.ఓబులేసు, శ్రీరాములుతో కలిసి చిన్న అంకన్న ఇంటి వద్ద భోజనానికి ఆహ్వానించేందుకు వెళ్లగా.. అదే సమయంలో కట్టెలు, ఇసుపరాడ్లు, రాళ్లతో సిద్ధంగా ఉన్న మారుతీకుమార్, రాము, శివ, రామాంజనేయులు, విశ్వనాథ, నీలకంఠ, పెద్దపెద్దయ్య, పుల్లయ్య, పెద్దిరాజు, పెద్దయ్య, కాంతన్న, నారాయణస్వామి వచ్చినవారిని కులం పేరుతో దూషిస్తూ.. సోమశేఖర్‌నాయుడితో మేము కొట్లాడితే మీరు వెళ్లి మాట్లాడి వస్తారా అంటూ దాడికి పాల్పడినట్లు తెలిపారు. క్షతగాత్రులను అదే రోజు రాత్రి తాడిపత్రిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మరుసటి రోజు అవుట్‌పోస్టు పోలీసులు కొండాపురం పోలీసులకు చెప్పారు. లచ్చుప్పగారి ఓబులేష్ ఫిర్యాదు మేరకు 12 మందిపై హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు కేసు నమోదు చేయగా అప్పటి డీఎస్పీ సర్కార్ చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. నిందితుల్లోని పెద్దపెద్దయ్య అనారోగ్యంతో మృతి చెందారు. వాదనలు విన్న కడప న్యాయస్థానం 11 మంది నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు ఇచ్చారు. కేసు దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన పోలీసు సిబ్బందిని, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముబీనబేగాన్ని జిల్లా ఎస్పీ ప్రశంసించారు.

ఘరానా మోసం

ఇద్దరిపై కేసు నమోదు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప తాలూకా రాణా పరిధిలో జరిగిన ఘరానా మోసం ఘటనలో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. కడప నబీకోటకు చెందిన శశిధర్‌రెడ్డి, జిలానీలు అదే ప్రాంతానికి చెందిన కార్ల యజమాని వీరేంద్ర వద్ద మూడు కార్లను అద్దెకు తీసుకున్నారు. రెండు నెలల పాటు సక్రమంగా అద్దె ఇచ్చారు. మూడో నెల నుంచి అద్దె ఇవ్వలేదు, కార్లు ఇవ్వలేదు. దీంతో వారిని యజమాని వీరేంద్ర ప్రశ్నించగా తమ వద్ద కార్లు లేవు, కుదవకు పెట్టామని చెప్పడంతో బాధితుడి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. నిందితులు ఇప్పటి వరకు 20 వాహనాలను ఇలానే అద్దెకు తీసుకుని కుదవపెట్టారని పోలీసులు తెలిపారు.



మైలవరం వైపు ప్రవహిస్తున్న కృష్ణాజలాలు

10 వేల క్యూసెక్కుల నీరు విడుదల

కొండాపురం, న్యూస్‌టుడే: గండికోట జలాశయం నుంచి మైలవరం రిజర్వాయర్‌కు నాలుగు గేట్ల ద్వారా 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జలవనరులశాఖ డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. బుధవారం డీఈ మాట్లాడుతూ నంద్యాల జిల్లా అవుకు జలాశయం నుంచి గండికోటకు 10 వేల క్యూసెక్కుల నీరు వస్తున్న నేపథ్యంలో మైలవరం రిజర్వాయర్‌కు నీటి తరలింపు పెంచినట్లు వెల్లడించారు. ప్రస్తుతం గండికోట జలాశయంలో 25.9 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్లు తెలిపారు. గండికోట ఎత్తిపోతల పథకాల నుంచి సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, పైడిపాళెం రిజర్వాయర్‌కు 770 క్యూసెక్కుల నీటిని పంపుతున్నట్లు తెలిపారు.

స్మగ్లర్లపై ప్రత్యేక నిఘా

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం రేంజి లంకమల అభయారణ్యంలోని గొల్లపల్లె పరిధి అటవీ ప్రాంతంలో బుధవారం స్మగ్లర్ల కోసం అటవీ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. అటవీక్షేత్రాధికారిణి కళావతి మాట్లాడుతూ.. లంకమల అభయారణ్యంలో ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా అప్రమత్తంగా ఉంటూ గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు. స్మగ్లర్లపై ప్రత్యేక నిఘా ఉంచామని స్పష్టం చేశారు. ఉప అటవీక్షేత్రాధికారి ఓబులేసు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

సాధన చేస్తాం...లక్ష్యం సాధిస్తాం

రాష్ట్రస్థాయిలో సత్తా చాటి జట్టులో చోటే ధ్యేయం

రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పాఠశాల, మండల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభయ్యాయి. జిల్లాలో పులివెందుల, ప్రొద్దుటూరుల్లో అండర్-17, 19 బాలబాలికలకు జిల్లా స్థాయి టెబుల్ టెన్నిస్ క్రీడా పోటీలు జరిగాయి. ఇందులో ఉత్తమ ప్రతిభ చూపిన బాలబాలికలను సెలెక్టర్లు జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. వీరంతా త్వరలో విజయవాడలో జరిగే ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి టెబుల్ టెన్నిస్ క్రీడా పోటీల్లో తలపడనున్నారు. -న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

మహిళా విభాగంలో ప్రతిభ



ఈ యువతి పేరు **షేక్ అల్ అమిన్**, సీనియర్ ఇంటర్ చదుతున్నారు. అమ్మ షకీలాభాను, నాన్న గౌస్‌ముద్దీన్ ప్రభుత్వ ఉద్యోగులు. వీరి ప్రోత్సాహంతో మక్కువ పెంచుకున్నారు. కడపలో ప్రస్తుతం ఉమన్ విభాగాలో ఆడుతున్నారు. 2022, 2023, 2024లలో విజయవాడ, గుంటూరు, రాజమండ్రి ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్వార్టర్ ఫైనల్ పోటీల్లో ప్రతిభ చూపారు

దేశానికి ఆడటమే స్వప్నం



వరుసగా 2022, 2023లో విజయవాడ, గుంటూరుల్లో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్వార్టర్ ఫైనల్లో ప్రతిభచాటిన **బి.సంజన** దువ్వూరు మండలం మాచనపల్లె నివాసి. వీరిది రైతు కుటుంబం. అమ్మ ఉమామహేశ్వరి, నాన్న బి.వి.శివారెడ్డి. పీఈటీ శివశంకర్‌రెడ్డి రెండేళ్ల నుంచి శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర జట్టుకు ఎంపికవ్వాలని సాధన చేస్తున్నారు. భారత్ తరపున ఆడాలని ఉంది.

ఐఏఎస్ కావడం ఆశయం



సాధారణ కుటుంబం నుంచి వచ్చిన **సి.శివజ్యోతి.** పొట్లదుర్తి చదువుతోంది. అమ్మ ఈశ్వరమ్మ, నాన్న కేశవ డ్రైవర్. వీరి ప్రేరణతో పీఈటీ లక్ష్మీ టెబుల్ టెన్నిస్ నేర్పించారు. దాంతో తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడేందుకు జిల్లా జట్టుకు ఎంపికైంది. ఐఏఎస్ కావడమే నా జీవితాశయం అంటోంది.

సివిల్ ఇంజినీరింగ్ ధ్యేయం



వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన **ఎస్.లక్ష్మి** పెద్దముడియం మండలంలోని ఎన్.కొట్టాలపల్లి గ్రామంలో ఉంటోంది. అమ్మ సువర్ణ, నాన్న చిన్న నరసింహ వ్యవసాయకూలీ. రెండేళ్లుగా పీఈటీ పద్మజ శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్రస్థాయిలో స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో ఉత్తమ ప్రతిభ చూపారు. సివిల్ ఇంజినీరింగ్ కావడమే ధ్యేయమని అంటున్నారు.

ప్రొద్దుటూరు

●ప్రొద్దుటూరు ● జమ్మలమడుగు ● బద్వేలు ● మైదుకూరు

వర్షం వచ్చింది... రోడ్డు మునిగింది



వర్షం వచ్చిందంటే చాలు జమ్మలమడుగు నుంచి కోవెలకుంట్లకు వెళ్లే ప్రధాన దారి నిండుకుండలా మారిపోతుంది. రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో ఈ మార్గంలో వెళ్లాలంటే ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో రాత్రి వేళల్లో చోదకులు జారిపడి ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి గోతులకు మరమ్మతులు చేసి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

మైలవరం జలాశయం నుంచి పెన్నాకు నీటి విడుదల



మైలవరం, న్యూస్‌టుడే: మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 4 గేట్ల ద్వారా 12 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు డీఈఈ ఆనంద నరసింహామూర్తి బుధవారం తెలిపారు. మైలవరం జలాశయం ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 180 క్యూసెక్కులు నీరు పోతున్నట్లు చెప్పారు. గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయనికి 10 వేల క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు పేర్కొన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

కూలిన పాతమిద్దె, పాఠశాల ప్రహరీ



ఓంశాంతినగర్‌లో కూలిన పాతమిద్దె

మైదుకూరు, బ్రహ్మంగారిమఠం, కలసపాడు, దువ్వూరు, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో మైదుకూరులోని ఎల్లంపల్లె నుంచి చిన్నయ్యగారిపల్లెలో పొలాల్లోని నీరంతా దిగువగా ప్రాంతానికి చేరాయి. బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో దారిపైకి నీరు చేరింది. పట్టణంలోని ఓంశాంతినగర్‌లో ఇంటిలో ఎవరూలేని సమయంలో పాతమిద్దె ఒకటి కూలడంతో ప్రమాదం తప్పింది. బ్రహ్మంగారిమఠం మండలంలో సోమిరెడ్డిపల్లె సమీప వంక పొంగింది. ఉదయం 9 గంటల వరకు బ్రహ్మంగారిమఠం-బద్వేలు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కలసపాడులోని ప్రాథమిక పాఠశాల ప్రహరీ 70 అడుగుల పొడవున కూలిపోయింది. దువ్వూరు మండలం నీలాపురం నుండి సుగాలి తాండ గ్రామానికి వెళ్లే రహదారి మార్గంలో ఉన్న వంకకు వంతెన లేకపోవడంతో భారీ వర్షం కురిస్తే పెద్ద ఎత్తున నీరు ప్రవహిస్తు తాండ ప్రజలు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.



కలసపాడులో పడిపోయిన పాఠశాల ప్రహరీ



వంతెన లేకపోవడంతో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

మురుగు...రోడ్లపై పరుగు



స్థానిక వైఎస్‌నగర్‌లో వర్షపు నీరు వెళ్లే మార్గం లేక మురుగునీరుగా మారుతోంది. బుడ్డాయపల్లె, బొల్లవరం ప్రాంతాల నుంచి మురుగునీరు వారాల కొద్ది నిలుస్తోంది. చిన్నపాటి చినుకు పడితే రోడ్డుపైనే వర్షపునీరు నిలిచి పోయి వెళ్లే మార్గం లేక మురుగునీరుగా మారుతోంది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి నీరంతా రోడ్డుపై నిలుస్తోంది. మురుగునీటిని తొలగించేందుకు చర్యలు చేపడతామని కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు.

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

బాధితుల గోడు... పోలీసులు పట్టించుకోరు

- మహిళల మెడలో గొలుసులు లాక్కెళుతున్న వైనం
- తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు రెక్కీ
- ప్రొద్దుటూరులో పనిచేయని సీసీ కెమెరాలు

–న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు నేరవార్తలు



చోరి జరిగిన ప్రదేశంలో డాగ్ స్క్వాడ్ బృందం

మహిళలనే లక్ష్యంగా చేసుకుని దొంగలు పంజా విసురుతున్నారు. ఒంటరిగా కనిపిస్తే చాలు బైక్‌పై వేగంగా వచ్చి వారి మెడలోని బంగారం గొలుసులను తెంచుకుని ఉడాయిస్తున్నారు. దొంగా..దొంగా అంటూ కేకలు వేసేలోపే కనుమరుగవుతున్నారు. ప్రొద్దుటూరులో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతుండటంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. బంగారం ఆభరణాలు ధరించి బయటకు రావాలంటే భయపడుతున్నారు. మరోవైపు దొంగలు తాళం వేసిన ఇళ్లు, దుకాణాలతో పాటు ఆలయాలను సైతం వదలకుండా చోరీలకు పాల్పడుతున్నారు. విలువైన బంగారం, డబ్బు అపహరిస్తుండగా బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వారు పోలీసులను ఆశ్రయిస్తున్నా నిందితులను మాత్రం పట్టుకోలేకపోతున్నారు. బైక్‌లో వచ్చే దొంగలు హెల్మెట్, మాస్కు ధరిస్తుండటంతో గుర్తుపట్టడం కష్టంగా మారుతోంది. దీనికి తోడు పట్టణంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో సమస్యగా మారింది. గతంలో జరిగిన గొలుసు చోరీల్లో నిందితులను పోలీసులు ఇప్పటికీ గుర్తించలేదు. పలు వీధుల్లో దొంగలు రెక్కీ నిర్వహించాక తమ పని కానిచ్చేస్తున్నారు. మరోవైపు దుకాణాల తాళాలు పగులగొట్టి అందులో ఉన్న నగదు అపహరిస్తున్నారు. ఈ ఘటనలన్నీ రాత్రి సమయంలోనే జరుగుతున్నాయి. తెల్లవారాక ఇరుగుపొరుగు వ్యక్తులు గుర్తించి పోలీసులకు చెబుతున్నారు. అర్ధరాత్రి సమయంలో మరింత గస్తీ పెంచాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల కొన్ని ఘటనలు

* ప్రొద్దుటూరులోని జిన్నా రోడ్డులో కూరగాయలు కొనేందుకు బయటకొచ్చిన ఓ వృద్ధురాలి మెడలోని రెండున్నర తులం బంగారం గొలుసు దొంగ లాక్కెళ్లిపోయాడు. ఈ ఘటనలో వృద్ధురాలు కింద పడి గాయపడ్డారు.

* స్థానిక శాస్త్రినగర్‌లో ఓ మహిళ నడచి వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి రెండున్నర తులం బంగారం గొలుసు లాక్కొని వెళ్లిపోయారు. ఏడాది దాటినా నిందితులను పోలీసులు గుర్తించలేదు. దొరసానిపల్లెలోనూ ఇలాగే జరిగాయి.

* ప్రొద్దుటూరు మండల పరిధిలోని గ్రీన్‌ల్యాండ్ విల్లాస్‌లో ఏడాది కిందట సుమారు రూ.25.68 లక్షలు విలువైన 85 తులాల బంగారం అపహరించారు. ఆ కేసులో పురోగతి లేదు.

* విజయనగరంవీధిలో తాళం ఇంట్లో గత ఏడాది జరిగిన చోరీ ఘటనలో దాదాపు 27 తులాల బంగారం, 250 గ్రాముల వెండి, రూ.70 వేలు నగదు చోరీ చేశారు. ఏడాది దాటినా దర్యాప్తు సాగలేదు.

* స్థానిక వైఎంఆర్ కాలనీలో తాళం వేసిన రెండు దుకాణాల్లో ఆగస్టు 24న రాత్రి చోరీ జరిగింది. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసులో నిందితుల్ని పట్టుకున్నామని పోలీసులు చెబుతున్నారు.

నిఘా పెంచాం



ప్రొద్దుటూరులో చోరీలు జరగకుండా సిబ్బందిని అప్రమత్తం చేశాం. రాత్రి సమయంలో గస్తీ ముమ్మరం చేశాం. సబ్ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఏటీఎంల వద్ద కొన్ని క్లస్టర్స్‌గా విభజించి నిఘా ఉంచాం. ప్రతి స్టేషన్ నుంచి ఎస్.ఐ లేదా సీఐలు తిరిగేలా చర్యలు చేపట్టాం. గొలుసు చోరీలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

-భక్తవత్సలం, డీఎస్పీ, ప్రొద్దుటూరు

యువత దేశాభివృద్ధిలో కీలకం

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: యుతన నైపుణ్యాలను పెంపొందించుకుని దేశాభివృద్ధిలో భాగం కావాలని జిల్లా యువజన అధికారి మణికంఠ అన్నారు. పొద్దుటూరు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో బుధవారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో 'మై భారత్'లో భాగంగా ఎక్స్‌పెర్మెంట్ లెర్నింగ్, యువతకు శిక్షణ నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు శూలం లక్ష్మీదేవి, వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు, పక్కన జిల్లా యువజన అధికారి మణికంఠ

పారిశుద్ధ్య అధికారిగా సునీత

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక సంఘ కార్యాలయానికి పారిశుద్ధ్యాధికారిగా ఎం.సునీత బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఆళ్లగడ్డ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు.

ఎత్తిపోతల పథకం పరిశీలన

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని తెలుగుగంగ ప్రధాన ఎడమకాలువ నుంచి తరువాగుకు ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాన్ని బుధవారం యువనాయకుడు రితేష్‌రెడ్డి పరిశీలించారు. ఒక మోటారు చెడిపోగా, మరో మోటారు రన్నింగ్‌లో వేడెక్కి పనిచేయడంలేదని రైతులు తెలిపారు. ఉన్న ఒక్క మోటారు రన్నింగ్‌లో ఉందన్నారు. సాగునీటి సమస్యలు తీర్చాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కూటమి అభ్యర్థి బొజ్జా రోశన్న, తెదేపా నాయకులు డి.రాంభూపాల్‌రెడ్డి, వీరారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రోశిరెడ్డి, పలుగ్రామాల రైతులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

పట్టణాలు, గ్రామాలు అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రజాప్రతినిధులు అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎన్డీయే నాయకులు హాజరై మాట్లాడారు. వైకాపా హయాంలో గ్రామంలో కనీసం బ్లీచింగ్ చల్లడానికి నిధులు కేటాయించలేదన్నారు. ప్రజలను వేధించడానికే జగన్‌మోహన్‌రెడ్డి పాలనా కాలం సరిపోయిందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలకు భరోసా ఇచ్చిందన్నారు. **-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు వైద్యం, కలసపాడు, జమ్మలమడుగు గ్రామీణ**



కలసపాడులో మాట్లాడుతున్న తెదేపా సమన్వయకర్త రితేష్‌రెడ్డి, పక్కన భాజపా నాయకుడు బొజ్జా రోశన్న, తదితరులు



జమ్మలమడుగులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పక్కన తెదేపా బాధ్యుడు భూపేష్‌రెడ్డి



ప్రొద్దుటూరులో మహిళలకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, ఆసం రఘురామిరెడ్డి, నాయకులు

ఉపాధికి వరం... భవిష్యత్తుకు మార్గం

పేద, గ్రామీణ యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణ

–న్యూస్‌టుడే, జమ్మలమడుగు



తరగతులు నిర్వహిస్తున్న ఛేంజ్ మేకర్ సుబహాన్

యువకుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం వారిలో నైపుణ్యాభివృద్ధిని పెంచుతోంది. ఇది ఉపాధి, ఉద్యోగావకాశాలను పెంచుతుందని బోధకులు వివరిస్తున్నారు. ఇందుకు ప్రధానంగా చదువుల అనంతరం సమాజంలో అడుగుపెట్టే ప్రతి యువత తనకు తన కుటుంబానికి ఆసరగా నిలిచేలా వారిలో స్పృహ పెంచేదిశగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందుకు కళాశాలలను వేదికగా ఏర్పాటు చేస్తున్నారు. కోర్సు పూర్తి కాగానే ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో నిర్వాహకులు సహాయ పడతారు. ఇందులో భాగంగా జమ్మలమడుగు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ప్రిన్సిపల్ నవరూప్‌కుమార్ నేతృత్వంలో యువతకు ఉన్నతి సంస్థ ఛేంజ్ మేకర్ సుబహాన్ తరగతులు నిర్వహిస్తున్నారు. ట్రేడ్‌ల వారీగా తర్ఫీదు ఇచ్చిన తర్వాత సంస్థ నిర్వాహకులు ఉచితంగా ఈ-సర్టిఫికెట్లు అందజేసి వారి వివరాలను 'ఉద్యోగం' పోర్టల్‌లో నమోదు చేయిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు రాకపోతే ముగ్గురు ప్లేస్‌మెంట్ అధికారులు వారికి ఉపాధి కల్పించడంలో సహాయపడతారు. ఐటీఐ విద్యార్థులకు మ్యానుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రికల్, ఫిట్టర్ రంగాల్లో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని నిర్వాహకులు చెబుతున్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకుంటా



ఎలక్ట్రీషియన్‌లో చేరాను. ఇప్పుడు నైపుణ్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని మంచి సంస్థలో ఉద్యోగం సాధించాలన్నది నా ఆశయం.

-సురేందర్‌రెడ్డి, ఎలక్ట్రీషియన్

జీవితానికి భరోసా



మోటారు మెకానిక్ ట్రేడ్‌లో చేరాను. గతంలో ఐటీఐలో చేరితే ఉద్యోగాలు ఎవరు ఇస్తారని అపోహ ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పలు కంపెనీలు కళాశాలల వద్దకే వచ్చి ప్లేస్‌మెంట్ ఇస్తున్నారు. ఇప్పుడు కొత్తగా శిక్షణతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని హామీ ఇస్తున్నారు. -సురేష్‌కుమార్‌రెడ్డి, మోటార్ మెకానిక్

రైల్వే, ఆర్టీసీలో అవకాశాలు



నైపుణ్య శిక్షణ తరగతులు ఉపయోగించుకుని రైల్వే, ఆర్టీసీలో ఉద్యోగం సాధించేందుకు కృషి చేస్తాను. ఇప్పుడిప్పుడే ఐటీఐకు ఆదరణ పెరుగుతోంది. నా స్నేహితులను ఐటీఐలో చేరమని సలహా ఇస్తాను.

-శ్రీహరి, ఫిట్టర్

యువతకు ఎంతో మేలు



ప్రభుత్వ సహకారంతో నైపుణ్యంలో శిక్షణ తరగతులు నిర్వహించడం యువతకు ఎంతో మేలు జరుగుతుంది. కోర్సు పూర్తైన తర్వాత ఉద్యోగం కోసం ఎక్కడికెక్కడికో వెళ్లకుండా నిర్వాహకులు సహాయ సహకారాలు అందించడం సంతోషకరం.

-కిరణ్, వెల్డర్, జమ్మలమడుగు పట్టణం

దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

మైదుకూరు, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల సందర్భంగా బుధవారం మైదుకూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు సూరిశెట్టి శివ వెంకట ప్రసాద్ గుప్తా ఆధ్వర్యంలో ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చేనెల 3న రాజరాజేశ్వరీదేవి అలంకారంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని సభ అధ్యక్షుడు ప్రసాద్ గుప్తా తెలిపారు. 4న గాయత్రీదేవి, 5న పార్వతీదేవి, 6న మహాలక్ష్మీదేవి, 7న అన్నపూర్ణాదేవి, 8న భువనేశ్వరి, 9న సరస్వతీదేవి, 10న మహిషాసురమర్దిని దేవి, 11న గజలక్ష్మీదేవి, 12న విజయలక్ష్మీదేవి అలంకారాల్లో అమ్మవారు దర్శనమిస్తారని పేర్కొన్నారు. 13న వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.



ఉత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా రుద్రాభిషేకాలు, కుంకుమార్చనలు తదితర పూజలు చేశారు. నవగ్రహ, గోపూజ, మృత్యుంజయ మహాహోమాలను తదితర పూజలను నిర్వహించారు.



హోమం చేస్తున్న ఆలయ అర్చకులు

సీఎం సహాయనిధికి విరాళం

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం మేముసైతం అంటు మంగళవారం రూ. 10,120 లను డీడీ రూపంలో సీఎంఆర్ఎఫ్ నిధికి అంజేయాలని జేసీ అధితిసింగ్‌కు పాఠశాల ప్రిన్సిపల్ పద్మనాభమూర్తి అందించారు. విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది సబ్బరామయ్య, బసిరెడ్డి, రామమోహన్, గురురత్నం, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

బి.కోడూరు, న్యూస్‌టుడే: మండలంలోని పీహెచ్‌సీని బుధవారం ఆర్‌బీఎస్‌కే కార్యక్రమ జిల్లా వైద్యాధికారి రమేష్ తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తదనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. సీహెచ్‌వో నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


వేమలూరు క్రాస్‌లో ఘర్షణ

అట్లూరు, న్యూస్‌టుడే : మండలంలోని వేమలూరు క్రాస్‌రోడ్డులో మంగళవారం రాత్రి పాతకక్షల కారణంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుందని ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఒక వర్గంలో మనోహర్, అయ్యవారయ్య, రామసుబ్బయ్య మరి కొందరిపై మరో వర్గంలో గంగయ్య, శివయ్య, అయ్యావారయ్య మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

భాజపా సభ్యత్వ నమోదుకు స్పందన

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జనసంఘ్ వ్యవస్థాపకులు, భాజపా సిద్ధాంత కర్త దీన్ దయాల్ ఉపాధ్యాయ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి బుధవారం స్థానిక ముద్దనూరు రోడ్డులోని భాజపా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి స్పందన లభించిందని ఎమ్మెల్యే అన్నారు.

ప్రొద్దుటూరులో ఎడిఫై పాఠశాల



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న జీవనజ్యోతి విద్యా సంస్థల అధినేత అమర్‌నాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: పట్టణంలోని జీవన జ్యోతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఎడిఫై పాఠశాలను వచ్చే విద్యా సంవత్సరం ప్రొద్దుటూరులో ప్రారంభిస్తున్నట్లు ఆ విద్యా సంస్థల అధినేత అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. దువ్వూరు రోడ్డులోని కామనూరు గ్రామం సమీపంలో దాదాపు 10 ఎకరాలు విస్తీర్ణంలో పాఠశాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విశాలమైన ఆట స్థలం, ఏసీ తరగతి గదులు, తదితర సౌకర్యాలతో పాటు ఉన్నత విద్యా బోధనే లక్ష్యంగా పాఠశాలను ప్రారంభిస్తామన్నారు. అందుకు సంబంధించి ఎడిఫై స్కూల్ యాజమాన్యం జీవనజ్యోతి విద్యా సంస్థలకు ఫ్రాంఛైజీ ధ్రువీకరణ ప్రతాలు అందించినట్లు తెలిపారు.

విద్యుత్తు ఉద్యోగుల సాయం

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: బద్వేలు పట్టణంలోని షాలోమ్ అనాథ శరణాలయంలో ఉన్న 22 మందికి బుధవారం కడప విద్యుత్తు ఉద్యోగుల సామాజిక సేవా సంఘం తరపున రూ.35 వేలతో ఒకొక్కరికి రెండు జతల స్కూలు యూనిఫామ్‌లు ఇచ్చారు. వీటిని విద్యుత్తు ఎస్ఈ రమణ వారికి అందజేశారు. అధికారులు నాగరాజు, చలపతి, భరణికృష్ణా, రవిచంద్ర, శేఖర్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో అంధకారం

- ఏ వీధికెళ్లినా చిమ్మ చీకట్లే
- పట్టించుకోని అధికారులు...ఇబ్బందుల్లో ప్రజలు

–న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు, ప్రొద్దుటూరు పట్టణం

ప్రొద్దుటూరు పురపాలక పరిధిలో ఎల్ఈడీ వీధి దీపాల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఏ వీధికెళ్లి చూసిన చిమ్మ చీకట్లే కమ్ముకున్నాయి. దాంతో పుర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధి దీపాల నిర్వహణను నిర్వహించే సంస్థ ఒప్పందం గడువు ముగిసి, కొత్త వారికి ఇవ్వడం, అధికారుల నిర్లక్ష్యమే ఈ దుస్థితికి కారణమని తెలుస్తోంది.

✤ ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలో 41 వార్డులున్నాయి. 40 వేల కుటుంబాలకు 2.50 లక్షలకు పైగా నివసిస్తున్నారు. 20 వాట్స్ నుంచి 120 వాట్స్ సామర్థ్యం కల్గిన 8,026 ఎల్ఈడీ వీధి దీపాలు ఉన్నాయి. ఇందులో 7,780 దీపాలను 388 సీసీఎం ప్యానెల్ బాక్సుల ద్వారా (ఆటోమేటిక్ టైమింగ్) ఉదయం 6 గంటలకు, సాయంత్రం 6 గంటలకు ఆఫ్, ఆన్ చేయడానికి ఈఎస్ఎల్ఐ సంస్థ ఏడేళ్ల పాటు ఒప్పందం తీసుకుంది. దీని గడువు ఈ ఏడాది మే 5వ తేదీకి ముగిసింది. ఆ తర్వాత ఈ ప్రక్రియను ఒక్క నెలకు రూ.1.13 లక్షలు తీసుకొని మరో నాలుగు నెలలు (మే 5 నుంచి సెప్టెంబరు వరకు) తమిళనాడుకు చెందిన స్మెల్ కంపెనీ నడిపింది. ఇప్పుడు హైదరాబాద్‌కు చెందిన ప్రొ-లైట్ ఇండియా సంస్థ ఈ నెల 13వ తేదీ నుంచి 8 నెలల పాటు వీధి దీపాల నిర్వహణ చేసేందుకు రూ.9.25 లక్షలకు ఒప్పందం చేసుకుంది. దీనిని నడిపేందుకు మరో గుత్తేదారుడు అంగీకారం చేసుకున్నప్పటికీ వీధి దీపాలు ఆన్, ఆపు చేయు విధానంపై అవగాహన లేక ప్రొద్దుటూరు పట్టణమంతా అంధకారంలో ఉంది. ఈ పరిస్థితి రామేశ్వరం ఆదాయ పన్ను శాఖ కార్యాలయం ఎదురు సందు, వరలక్ష్మి అపార్టుమెంట్, మోడంపల్లె, గౌతం ఉన్నత పాఠశాల వెనుక చర్చి సందు, శ్రీరామ్‌నగర్-2, 38వ సచివాలయం సందు, శాంతకుమారి వీధి, రాజాజీ రోడ్డు, వేమన నగర్‌లో నెలకొంది. ఈ విషయమై ప్రొద్దుటూరు పురపాలక సంఘం కమిషనరు రఘునాథ్‌రెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణను ఇటీవలే కొత్తవారు చేపట్టారన్నారు. అక్కడక్కడ సమస్య వస్తోందని, తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.



వీధి దీపం వెలగక అంధకారంలో మోడంపల్లె వీధి



గౌతం స్కూల్ వెనుక చర్చి సందులో పని చేయని సీసీఎం బాక్సు

చరవాణి అప్పగింత

మైదుకూరు, న్యూస్‌టుడే : బస్సులో పడిపోయిన సెల్‌ఫోన్‌ను మండలంలోని జీవీసత్రానికి చెందిన ప్రయాణికుడు కొట్టాలపల్లె మల్లికార్జునకు మైదుకూరు డిపో అధికారులు బుధవారం అప్పగించారు. ప్రొద్దుటూరు నుంచి మైదుకూరు వస్తూ ప్రయాణికుడు మల్లికార్జున నిద్రలోకి జారుకున్నారు. సెల్‌ఫోన్ కిందపడి పడిపోగా గుర్తించలేదు. విధుల్లో ఉన్న కండక్టరు శాంతకుమారి మైదుకూరు ఏడీసీ లక్ష్మయ్యకు అందజేశారు. ప్రయాణికుడిని పిలిచి సెక్యూరిటీ కానిస్టేబుల్ ఎన్.సంజీవయ్య సమక్షంలో సెల్‌ఫోన్ అప్పగించారు.

అడిషనల్ ఎస్పీకి వినతి

మైదుకూరు, న్యూస్‌టుడే : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించి కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేసిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరుతూ జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రకాష్‌బాబుకు మాలమహానాడు నాయకులు వినతిపత్రం సమర్పించారు. మాలమహానాడు యూత్ జిల్లా అధ్యక్షుడు తీట్ల చిట్టిబాబు ఆధ్వర్యంలో ప్రతినిధులు బండి పుల్లయ్య, పసల సుధాకర్, భూమిరెడ్డి చిన్న మాధవయ్య, చిన రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కడప

•కడప •పులివెందుల •కమలాపురం

జీవకోటి మనుగడకు నీరే ఆధారం



స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : భూమిపై సమస్త జీవకోటి మనుగడకు నీరే ఆధారమని ప్రభుత్వ బాలుర కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి.రవీంద్రనాథ్ పేర్కొన్నారు. 30 ఆంధ్రా బెటాలియన్ సీవో సూర్యనారాయణమూర్తి ఆదేశాల మేరకు నగర శివారులోని పాతిమా కళాశాల వద్ద కేసీ కెనాల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లతో పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు కేసీ కెనాల్ పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు నీటిలో ఉన్న చెత్తచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ నీలయ్య, మహేష్, రమేష్, ఎంపీ.సురేష్‌బాబు, క్యాడెట్లు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యం

వైవీయూ (కడప): నూనె రహిత సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా జీవన ప్రమాణ రేటును పెంచుకోవచ్చునని యోగి వేమన విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఫుడ్ టెక్నాలజీ శాఖ, స్టార్ గ్లోబల్ ఏజెన్సీస్ సంయుక్త ఆధ్వర్యంలో వంట నూనెను తిరిగి వినియోగించడం ద్వారా కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పాత కాలపు ఆహారపు అలవాట్లు సజ్జలు, రాగులు, కొర్రలు, ఆకుకూరలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. వినియోగించిన నూనెను తిరిగి వాడటం ద్వారా అనేక రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. కార్యక్రమంలో బాధ్య రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, ఐంటాక్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జి.ప్రభాకర్‌రావు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, ఎండీ పంషేర్‌ఖాన్, స్టార్ గ్లోబల్ ఏజెన్సీస్ సీఈవో బాలాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక వైఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటి నీరుపోశారు. ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కలను విద్యార్థులు సంరక్షించాలన్నారు. ప్రిన్సిపల్ వెంకటేశ్, ఏపీజీబీ మేనేజర్ రాజేష్, ప్రసాద్, కిరణ్‌కుమార్, ఎస్‌ఆర్‌పీ ఉమామహేశ్వరి, రోహిణీకుమారి, క్షేత్రాధికారులు కిశోర్‌కుమార్ రెడ్డి, వెంకటపలపతి, శేఖర్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ర్యాలీలో పాల్గొన్న ఏపీజీబీ ఆర్ఎం శ్రీనివాసప్రసాద్

పంచాయతీ కార్యాలయం ముట్టడి

వేంపల్లె, న్యూస్‌టుడే: తాగునీటి సమస్య పరిష్కారం కోరుతూ వేంపల్లెలోని గోపీనగర్‌వాసులు బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. తమ కాలనీలో వందకు పైగా వ్యవసాయకూలీల కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. గత రెండునెలలుగా కాలనీకి సక్రమంగా తాగునీరు అందలేదని వాపోయారు. కొళాయిలు, మోటార్లు వినియోగించే వారికే కొంతమేర నీరందుతోందన్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ ఈవో ఎస్వీయల్లారెడ్డిని అడగ్గా తాగునీటి సమస్యను సత్వరం పరిష్కరిస్తామన్నారు.

ఆర్టీసీ ముంపు సమస్యపై సమావేశం

కడప నగరపాలక, న్యూస్‌టుడే : కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణను ముంపుబారి నుంచి రక్షించడానికి తీసుకోవాల్సిన చర్యలపై నగరపాలక కమిషనర్ నందన్, ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి, ఏఈఈలు వెంకటరమణ, వేణుగోపాల్ తదితరులతో నగరపాలక కార్యాలయంలో సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారానికి ప్రత్యేక కాలువ నిర్మించాలని నిర్ణయించారు.

• కడప నగరంలో వాయు నాణ్యత పెంచడం, పర్యావరణ పరిరక్షణ చర్యలను సమీక్షించడానికి నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం అధికారుల బృందం బుధవారం నగరపాలక కమిషనర్ నందన్‌తో సమావేశమయ్యారు. వాయుకాలుష్యం తగ్గించడానికి నగరంలో తీసుకుంటున్న చర్యలు, గాలి నాణ్యత మరింత పెంచడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై వారు సమీక్షించారు. కాలుష్యనియంత్రణలో ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించే అవసరాన్ని చర్చించారు.

నీటి సరఫరాకు అంతరాయం: గాలి వాన నేపథ్యంలో లింగంపల్లి, గండి వాటర్ వర్క్స్ పరిధిలోని విద్యుత్తు సరఫరా వ్యవస్థలోని తీగలు తెగిపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని కమిషనర్ తెలిపారు. దీంతో గురువారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో నీటిసరఫరా జరగదన్నారు. నీటిసరఫరా అత్యవసరమైతే ట్యాంకర్ల కోసం 99490 93772 ఫోన్ చేయాలని పేర్కొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

అడవి పందిని చంపిన కేసులో ముగ్గురి అరెస్టు

వేంపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని తువ్వపల్లెలో ఓ రైతు పొలంలో కరెంటుపెట్టి అడవి పందిని చంపిన కేసులో ముగ్గురిని అరెస్టుచేసి వారి నుంచి మూడున్నర కిలోల మాంసం స్వాధీనం చేసుకున్నట్లు అటవీరేంజీ అధికారి బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. గ్రామానికి చెందిన చిలేకాంపల్లె సిద్దారెడ్డి తన పొలం చుట్టూ కరెంటు పెట్టడంతో ఆ పొలంలోకి వచ్చిన అడవిపంది మృతి చెందింది. సదరు వ్యక్తి ఆ మాంసాన్ని గ్రామానికి చెందిన గొంది పల్లె వెంకటపతి, మరో ఇద్దరికి ఇచ్చారు. సిబ్బందితో దాడులు నిర్వహించగా సిద్ధారెడ్డి పరారయ్యారు. మిగిలిన ముగ్గురిని అరెస్టుచేసి పులివెందుల న్యాయస్థానంలో హాజరుపరిచారు. డీఆర్వో వెంకటసుబ్బయ్య, బేబి, మధు, స్ట్రైకింగ్‌ఫోర్సు సిబ్బంది పాల్గొన్నారని బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

గొర్రెల దొంగలు...

తొండూరు, న్యూస్‌టుడే: ఎనిమిది పెద్దగొర్రెలు(జీవాలు) దొంగలించిన అయిదుగురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ వెంకటరమణ, ఎస్సై పెద్దఓబన్న బుధవారం తెలిపారు. మండలానికి చెందిన కలమల వంశీ, మంగపట్నం అఖీల్, దొడియం రవి, యల్లటూరు ప్రశాంత్, తొండూరు కల్యాణ్ కలిసి సోమవారం రాత్రి కోరవారిపల్లెలో కొప్పుల రామకృష్ణా, చావిడి వెంకటరమణ జీవాల దొడ్డిలో నుంచి సుమారు. రూ. 1,30,000 విలువైన 8 పెద్దగొర్రెలను దొంగలించారు. యజమానుల ఫిర్యాదు మేరకు పశువుల విక్రయ సంతల్లో నిఘా పెట్టడంతో నిందితులను గుర్తించి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకుని బాధితులకు మంగళవారం రాత్రి అందించారు. ఎస్పీ హర్షవర్ధన్ చరవాణి ద్వారా ఎస్సై, సిబ్బందిని అభినందించారు.

లారీల ఢీ.. డ్రైవరుకు తీవ్ర గాయాలు

చెన్నూరు, న్యూస్‌టుడే: పాలెంపల్లె సమీపంలో బుధవారం తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో లారీ డ్రైవరుకి తీవ్ర గాయాలయ్యాయి. చెన్నై నుంచి గుజరాత్‌కు వెళుతున్న లారీ మండల పరిధిలోని పాలెంపల్లె టోల్‌ప్లాజా వద్దకు రాగానే ఎదురుగా నిలిపి ఉన్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రం తిరుపూరు జిల్లాకు చెందిన లారీ డ్రైవరు అంబర్సన్(30) తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సర్వజన ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

జోరువాన... జనం యాతన

రహదారులు, వీధుల్లో నిలిచిన నీరు

కడప, చిన్నచౌకు, అరవిందనగర్(కడప) న్యూస్‌టుడే : అల్పపీడన ప్రభావంతో మంగళవారం రాత్రి 11 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు కుండపోత వర్షం కురిసింది. కడప నగరంలో 90 మి.మీ వర్షం కురవడంతో తడిసి ముద్దయింది. లోహియానగర్, మరియాపురం, ఎన్జీవో కాలనీ, ఎస్‌బీఆర్ నగర్, అశోక్‌నగర్, సీఎస్ఐ మైదానం, భరత్‌నగర్, ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం, రైల్వేస్టేషన్ రోడ్డు, ప్రకాష్‌నగర్, కొండాయపల్లె శివారు ప్రాంతాల్లోని రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో వర్షం నీరు చేరింది.



మరియాపురంలో ఇళ్ల మధ్య నిలిచిన నీరు



లోహియానగర్‌లో నివాసాన్ని చుట్టుముట్టిన వర్షపునీరు



హోమియోపతి కళాశాలకు వెళ్లే దారిలో...

లోతట్టు ప్రాంతాలు జలమయం

నగరంలోని కొన్ని ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ నిండిపోయి రహదారులు, వీధుల్లో భారీగా వర్షం నీరు నిలిచింది. కొన్ని కాలనీల్లో మురుగు వ్యవస్థ లేకపోవడంతో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఎన్జీవో కాలనీలోని వరద నీరంతా లోతట్టు ప్రాంతమైన లోహియానగర్‌లోకి రావడంతో ప్రజలు బయటకు అడుగు పెట్టలేకపోతున్నారు. లోహియానగర్‌లోని ఎవరెస్టు కర్మాగారానికి వెళ్లే దారి మోకాలి లోతు వరకు వర్షం నీటితో నిండిపోయింది. అక్కడున్న పలు నివాసాల్లోకి నీరు చేరడంతో తాళాలు వేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. రవీంద్రనగర్‌లో సుమారు రెండు గంటల పాటు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఎన్జీవో కాలనీలోని పలు నివాసాల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తెల్లవారుజాము వరకు జాగారం చేశారు. మురుగు వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతోనే ఈ సమస్య ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు.

అస్తవ్యస్తంగా కాలువలు



అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా రాత్రివేళల్లో వర్షం కురుస్తోంది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మా వీధిలో వర్షం నీరు చేరింది. పాములు, విష కీటకాలు వస్తున్నాయి. చిన్నపిల్లలను బయటికి పంపించాలంటే భయంగా ఉంది. మురుగు కాలువలు సక్రమంగా లేవు. రోడ్లను ఎత్తు చేస్తే ఈ సమస్య ఉండదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. **- జయమ్మ, లోహియానగర్**

చాలా ఇబ్బందిగా ఉంది



నగరంలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు రావడంతో చాలా భయం వేసింది. తాము ఉంటున్న ప్రాంతం లోతట్టు కావడంతో ఎత్తు ప్రాంతాల్లో నుంచి నీరంత తమ వీధిలోకి వస్తున్నాయి. మురుగు కాలువలు నిండిపోయాయి. అధికారులు మురుగు కాలువలను శుభ్రం చేయాలి. **- షాబున్నీ, కడప**

మూడు రోజులుగా సమస్య



లోహియానగర్ లోతట్టు ప్రాంతం కావడంతో ఎన్జీవో కాలనీ నుంచి నీరంత ఇక్కడికి వచ్చి వీధుల్లో ప్రవహిస్తోంది. గత మూడు రోజుల నుంచి ఇదే సమస్య నెలకొంది. సరైన మురుగు కాలువలు లేకపోవడంతోనే వర్షం నీరు వీధులు, రోడ్లపై ప్రవహిస్తోంది. విషపురుగులు నీటిలో సంచరిస్తున్నాయి. బయటకు అడుగు పెట్టాలంటే భయంగా ఉంది. **- బాషా, లోహియానగర్**

రాష్ట్ర సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే: రాష్ట్ర సమగ్రాభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల మండలంలోని ఎర్రబల్లె, నల్లపురెడ్డిపల్లెలో బుధవారం ఆయన పర్యటించారు. ఇక్కడి అంగన్‌వాడీకేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. గర్భిణులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. నేతలు బొజ్జా మైసూరారెడ్డి, గంగిరెడ్డి, పటాలబాబు, తదితరులు పాల్గొన్నారు. విధులకు ఎగనామం పెడుతున్న ఎర్రబల్లి వీఆర్‌ఏ జనార్దన్‌పై చర్యలు తీసుకోవాలని కొత్తపల్లె, చంద్రగిరి, మోట్నూతలపల్లె గ్రామాల ప్రజలు ఎమ్మెల్సీ కలిసి విన్నవించారు.

పెండ్లిమర్రి : స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ 2047 కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. జంగంరెడ్డిపల్లె పొలాల్లో పొలం పిలుస్తోంది, మమ్ముసిద్దుపల్లెలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బుధవారం పాల్గొన్నారు. సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొక్కలు నాటారు. కరపత్రాలు పంపిణీ చేశారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వేణుగోపాల్‌రెడ్డి, తెదేపా మండల సమన్వయకర్త ఎస్వీ.గంగిరెడ్డి, మాజీ కార్పొరేటర్ విశ్వనాథరెడ్డి, నాయకులు అన్నమయ్య, విజయసారథిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, మండల ప్రత్యేకాధికారి సాయిగ్రేష్మ, ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, తహసీల్దారు అనురాధ, ఏవో జి.పి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం : గత అయిదేళ్లుగా సాగిన వైకాపా మాఫియా పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించిందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ తెలిపారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని సిద్దవటం మండలం బొగ్గిడివారిపల్లె గ్రామంలో బుధవారం తెదేపా నాయకుడు కుప్పాల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి జయసింహ, ఎంపీడీవో జవహర్‌బాబు, సర్పంచి చంద్రకళ, తెదేపా నాయకులు పుత్తా రామచంద్రయ్య, వీరనాల రామచంద్ర, చంద్ర ఓబులరెడ్డి, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వేముల : పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథి రెడ్డి తెలిపారు. వందరోజుల పాలనపై బుధవారం వేముల, వి.కొత్తపల్లె, గొందిపల్లెల్లో సమావేశాలు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ ఇందిరారాణి, మాజీ సర్పంచి హనుమంతురెడ్డి, నాయకులు ఓబుళరెడ్డియాదవ్, సత్యమారెడ్డి, రమణారెడ్డి, నాగభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎర్రబల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి



పెండ్లిమర్రి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

ఎంఎస్‌ఎంఈ సాంకేతిక కేంద్రాన్ని తరలించొద్దు

మారుతీనగర్, న్యూస్‌టుడే : వివిధ రంగాల్లో శిక్షణ, నైపుణ్యం, మార్కెటింగ్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక కేంద్రంలో ఏర్పాటు చేసిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల సాంకేతిక కేంద్రం (ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ కేంద్రం) సీఆర్‌డీఏకు తరలిస్తూ తెచ్చిన జీవో నెంబర్ 56ను తక్షణం ఉపసంహరించుకోవాలని లేదంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండు చేశారు. ఈ మేరకు స్థానిక కోటిరెడ్డి కూడలిలో సీపీఐ నాయకులు బుధవారం జీవో ప్రతులను దహనంచేశారు. ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ కేంద్రాలు ఏర్పాటులో భాగంగా విశాఖ, కడప జిల్లాల కొప్పర్తి పారిశ్రామిక కేంద్రం ఉత్తర బ్లాక్‌లో రూ.250 కోట్ల అంచనా వ్యయంతో 19.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిందన్నారు. దీంతో ఈ ప్రాంత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు నిరుద్యోగ యువతకు ఉపయోగపడుతందని అలాంటి సంస్థను రాష్ట్ర ప్రభుత్వం సీఆర్‌డీఏకు తరలిస్తూ జీవో తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఈ విషయమై సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి వేర్వేరుగా సమావేశం నిర్వహించి మాట్లాడారు.



కోటిరెడ్డి కూడలిలో జీవో ప్రతులను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

జేబీ ఆసుపత్రిలో రోబోతో మోకాళ్ల శస్త్రచికిత్స

మారుతీనగర్, న్యూస్‌టుడే : జేబీ ఆసుపత్రిలో అతి క్లిష్టమైన ప్రైమరీ కాంప్లెక్స్ మోకాలు రీ ప్లేస్‌మెంట్ రోబో ద్వారా విజయవంతం చేశామని జేసీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ జహంగీర్‌బాషా తెలిపారు. ఈ మేరకు జేబీ ఆసుపత్రిలో బుధవారం మాట్లాడుతూ.. నగరానికి చెందిన ఓబులమ్మ తన రెండు కాళ్లు అరిగిపోయి, వంకర పోయి వైద్యం కోసం జేబీ ఆసుపత్రికి వచ్చిందన్నారు. వైద్యులు ఆమెను పరీక్షించి రోబో ద్వారా ఈ శస్త్రచికిత్సను అతి తక్కువ ధరకే చేశామని తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం సులువుగా నడుస్తోందని బంధువులు ఆనందం వ్యక్తం చేసినట్లు వివరించారు. ఆసుపత్రి సీఈవో డాక్టర్ జయభారతి మాట్లాడుతూ.. తమ వద్ద రోబో ద్వారా ఆపరేషన్లు అతి తక్కువ ధరకే చేస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని తెలిపారు.



మోకాళ్ల శస్త్రచికిత్స అనంతరం రోగితో వైద్యులు

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : కడప నగర శివారులోని నిర్మలా ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ ఫార్మసీ ముందస్తు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మందుల వాడకంపై అవగాహన సదస్సు, క్విజ్ పోటీలు, మెగా ఉచిత ఆరోగ్య శిబిరం, మందులు క్రాస్టింగ్, వివిధరకాల మందులకు సంబంధించి ఎగ్జిబిషన్ నిర్వహించారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో కళాశాల ఛైర్మన్ బి.శ్రీనివాసులు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ యు.మోహన్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మందులను అందజేస్తున్న కళాశాల ఛైర్మన్ శ్రీనివాసులు

సీఎం చంద్రబాబును కలిసిన అలపర్తి



కడప, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని విజయవాడలో కవితా విద్యాసాంస్కృతిక సేవాసంస్థ జిల్లా అధ్యక్షుడు అలపర్తి పిచ్చయ్య చౌదరి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన రచించిన పర్యాటకం పుస్తకాన్ని సీఎంకు అందజేశారు.

మునిగిన పంటలు... కర్షకులకు కన్నీళ్లు

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, ఒంటిమిట్ట : సిద్దవటం మండలంలో వర్షంతో పంటలకు నష్టం జరిగింది. మండల కేంద్రంతోపాటు శివారు గ్రామాల్లోనూ వాన కురిసింది. దీంతో సిద్దవటం సమీపంలో వెన్ను దశకు వచ్చిన వరి పంట నేలవాలింది. చేతికందాల్సిన పైరు దెబ్బతిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొన్నపోలు, పి.కొత్తపల్లి గ్రామాల్లో మామిడి తోటల్లోకి వాన నీరొచ్చింది. ఇక్కడే ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నీట మునిగింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో నిత్యపూజకోనకు వెళ్లే రహదారిలో కొంతదూరం పాటు మట్టి పొర కోతకు గురైంది. దీంతో ముక్కంటి దర్శనం కోసం వస్తున్న భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు



తొండూరు మండలంలో ఇలా..



సిద్దవటం శివారులో నేలవాలిన వరి పంట

తొండూరు : మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కొర్ర, కంది, సోయాబీన్, ఉద్ది, ఎర్రగడ్డ పంటలు పూర్తిగా నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉడవగండ్ల, భద్రంపల్లె, సంతకొవ్వూరు, గంగనపల్లె, బూచుపల్లె గ్రామాల్లో ఉల్లిగడ్డ వారం, పది రోజుల్లో కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో వర్షాలు పడడంతో నష్టం వాటిల్లింది.

సబ్‌రిజిస్ట్రార్‌గా డీఎం బాషా బాధ్యతల స్వీకరణ

కమలాపురం, న్యూస్‌టుడే: కమలాపురం సబ్ రిజిస్ట్రార్‌గా డీఎం బాషా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి సబ్ రిజిస్ట్రార్ డి.మహబూబ్ బాషా మైదుకూరుకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ముద్దనూరు నుంచి బాషా ఇక్కడికొచ్చారు. క్రయవిక్రయదారులకు ఏ సమస్యలున్నా నేరుగా వచ్చి సంప్రదిస్తే పరిష్కరిస్తామన్నారు.

అభ్యర్థులకు సామర్థ్య పరీక్ష

కడప భాగ్యనగర్‌కాలనీ, న్యూస్‌టుడే: మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ, మిషన్ వాత్సల్య పథకం కింద అర్హత సాధించిన అభ్యర్థులకు కంప్యూటర్ సామర్థ్య పరీక్ష నిర్వహించారు. ఈ మేరకు బుధవారం వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఐసీ ఆధ్వర్యంలో అభ్యర్థులకు కంప్యూటర్ పరీక్ష నిర్వహించారు. బాలసదన్‌లో స్టోర్‌కీపర్ కమ్ అకౌంటెంట్ పోస్టుకు అర్హత సాధించిన 31 మంది అభ్యర్థులకు ఈ పరీక్ష నిర్వహించారు.

శిలాఫలకంలో పేర్లు లేకపోవడంపై ఆగ్రహం

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : జడ్పీ వాణిజ్య సముదాయం ప్రారంభోత్సవంలో ఏర్పాటు చేసిన శిలాఫలకంలో తమ పేర్లు లేకపోవడంపై కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, పోరుమామిళ్ల జడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.4.5 కోట్లతో ఏర్పాటు చేసిన జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్‌లో తమ పేర్లు లేకపోవడం సరికాదన్నారు. జడ్పీ సీఈవో ఇప్పటికైనా తన తప్పును సరిచేసుకోవాలన్నారు. లేకపోతే వచ్చే సర్వసభ్య సమావేశంలో ఈ విషయమై గట్టిగా ప్రశ్నిస్తామన్నారు.

పర్యాటక ప్రాంతాలపై చిత్ర ప్రదర్శన

ఎన్జీవో కాలనీ (కడప), న్యూస్‌టుడే : పర్యాటకంపై స్పృహ మనతోనే ప్రారంభం కావాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వల్లూరు బ్రహ్మయ్య పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తు వేడుకల్లో భాగంగా బుధవారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కె.జనార్దనరాజు ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల చిత్ర ప్రదర్శన నిర్వహించారు. పర్యాటక ప్రాంతాలను దర్శించేందుకు తొలి ప్రాధాన్యతనివ్వాలన్నారు. జిల్లాలో గండికోటతో ప్రపంచస్థాయిలో సగర్వంగా నిలిచామని స్పష్టం చేశారు. చరిత్ర అధ్యాపకుడు గంగాధర్ మాట్లాడుతూ.. కలెక్టర్ శివశంకర్ సహకారంతో గండికోటలో అవసరమైన వసతులు చేకూరుతున్నాయని, ఈ కోటకు యునెస్కో గుర్తింపుపై ఆశలు పెరుగుతున్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్యాట్రన్ చంద్రారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాసులు, రామలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

లింగాల, న్యూస్‌టుడే: వెలిదండ్ల విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని 11 కేవీ కర్ణపాపాయపల్లె ఫీడరు పరిధిలో మలుపుల్లో స్తంభాల మార్పు కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్తు అంతరాయం ఉంటుందని వెలిదండ్ల విద్యుత్తు ఏఈ బాలసంజీవులు తెలిపారు.

ఉద్యోగ మేళా రేపు

కమలాపురం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 27వ తేదీన జాబ్ మేళా(ఉద్యోగమేళా) నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాకు నవభారత్ ఫెర్టిలైజర్స్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్ లాంటి సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకుంటాయన్నారు.